క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 12న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. ఈద్గా, పోచమ్మకుంట, శ్రీనగర్ కాలనీ, నయీంనగర్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు. అలాగే, వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. గొల్లవాడ, శివాలయం, శంభునిపేట, ద్వారకా అపార్ట్‌మెంట్, ఆర్‌టీఓ ఆఫీసర్, నాయుడు పెట్రోల్ పంపు, నానామియా తోట, గండు మైసమ్మ దేవాలయం, కరీమాబాద్, వాటర్ ట్యాంక్, కుమ్మరివాడ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేటి నుంచి ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం

నయీంనగర్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని వికాస తరంగిణి, ప్రతిమ ఫౌండేషన్, ప్రతిమ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నుంచి 2026, ఆగస్టు 14వ తేదీ వరకు ప్రతిమ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యులు తిప్పని అవినాష్, శ్రీమాన్ దయాకర్ రెడ్డి తెలిపారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ క్యాంపులో ఉచిత కన్సల్టేషన్, వైద్య పరీక్షలు, వైద్యం అందించనున్నట్లు వివరించారు. సమావేశంలో వైద్యులు బచ్చు రాధాకృష్ణ, బచ్చు వీణ, ప్రభాకర్ రెడ్డి, తిరుమల్ రావు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పీజీటీ పోస్టుకు దరఖాస్తులు

న్యూశాయంపేట: వరంగల్ శంభునిపేట దూపకుంట రోడ్డులోని వరంగల్ (జీ2) బాలికల మైనారిటీ గురుకులంలో ఖాళీగా ఉన్న పీజీటీ (సోషల్) పోస్టు భర్తీకి ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సనా సెక్యూరిటీ ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ బాధ్యుడు మహ్మద్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14లోపు హనుమకొండ నయీంనగర్‌లోని పాత ఆర్టీఓ వద్ద ఉన్న కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని, వివరాలకు 0870 3558539 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

జాబ్‌మేళా వేదిక మార్పు

రామన్నపేట: నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ఆర్యవైశ్య మహాసభ, వరంగల్, హనుమకొండ జిల్లాల విభాగాల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించనున్న మెగా జాబ్‌మేళా వేదికను పోచమ్మమైదాన్‌లో అబ్బూస్ ఫంక్షన్ హాల్‌కు మార్చినట్లు ఆర్యవైశ్య మహాసభ ఇరు జిల్లాల అధ్యక్షులు దుబ్బ శ్రీనివాస్, తోట సురేష్ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. మొదట నగరంలోని రాధాకృష్ణ గార్డెన్‌లో నిర్వహిస్తామని తెలిపినప్పటికీ, అక్కడ పార్కింగ్ సమస్య తలెత్తుందని భావించి వేదిక మార్చినట్లు వివరించారు.

ఉత్సాహంగా లాన్‌టెన్నిస్ పోటీలు



వరంగల్ స్పోర్ట్స్: పంద్రాగస్టు వేడుకలను పురస్కరించుకుని హనుమకొండ లాన్‌టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం ఆవరణలోని టెన్నిస్ మైదానంలో జిల్లా స్థాయి లాన్ టెన్నిస్ క్రీడా పోటీలు సోమవారం ఉత్సాహంగా జరిగాయి. సీనియర్స్ మెన్స్ కేటగిరీ ఫైనల్ మ్యాచ్‌లో నాగయ్య, శీధర్ జట్టు వర్సెస్ శివరాజ్, రోహిత్ జట్టు హోరాహోరీగా తలపడగా, నాగయ్య, శ్రీధర్ జట్టు విజేతగా నిలిచి ట్రోఫీని దక్కించుకుంది. ముగింపు కార్యక్రమానికి ఒలింపిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అజీజ్‌ఖాన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవీ శ్రీనివాస్‌రావు హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో టెన్నిస్ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు ఏసీపీ అంబటి నర్సయ్య, ప్యాటర్న్ కె.రవిచంద్ర, కోశాధికారి సిరికొండ సుదర్శన్, ఉపాధ్యక్షులు బిహారీ, వెంకట నారాయణ, మల్లారెడ్డి, పెరుమాండ్ల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించే వారిని ప్రోత్సహిస్తాం

వరంగల్ క్రైం: క్రీడల్లో రాణించే పోలీస్ అధికారులు, సిబ్బందిని ప్రోత్సహిస్తామని వరంగల్ పోలీస్ కమిషన్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. జిల్లా టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జేఎన్ఎస్‌లో నిర్వహించిన లాన్ టెన్నిస్ పోటీల్లో డబుల్స్ విభాగంలో విజేతలుగా నిలిచిన ఏఆర్ ఏసీపీ నాగయ్య, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌ను సీపీ అభినందించారు.

చిన్నారులకు పోటీలు

కాజీపేట రూరల్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కాజీపేట రైల్వే జనరల్ ఇన్‌స్టిట్యూట్‌లో పిల్లలకు డ్రాయింగ్, పెయింటింగ్, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఇన్‌స్టిట్యూట్ జాయింట్ సెక్రటరీ ఎం.రాజయ్య, కల్చరల్ ఈవెంట్ ఇన్‌చార్జ్ దారావత్ రఘు, ఎస్.ప్రశాంత్, రవికిరణ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

బీమాతో రైతు కుటుంబానికి ధీమా

● రేపటితో ముగియనున్న రైతు బీమా గడువు

ఖిలా వరంగల్: విద్యుదాఘాతం, అనారోగ్యం, ప్రమాదాలు, ఆత్మహత్య ఇలా ఏ కారణంతో మృతిచెందిన రైతుల కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం రైతు బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ సంవత్సరంలో కొత్తగా అర్హులైన రైతులు రైతు బీమా కోసం నమోదు చేసుకోవడంతోపాటు ప్రస్తుత లబ్ధిదారులు వివరాల్లో మార్పు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. అనారోగ్యం లేదా ప్రమాదవశాత్తు మృతి చెందినా బాధిత రైతు కుటుంబానికి రూ.5 లక్షల సాయం సర్కారు నుంచి అందుతుంది. ఈ పథకానికి అవసరమైన ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తుంది. అర్హులైన రైతులు ఈనెల 13లోపు స్థానిక మండల వ్యవసాయ అధికారులకు కోసం దరఖాస్తు చేసుకోవాలి.

మార్పులు, సవరణలకు అవకాశం

నామినీ పేరు, రైతుల వివరాల్లో మార్పులు, చిరునామా, ఆధార్ కార్డు నంబర్, ఫోన్ నంబర్, బ్యాంకు ఖాతా, తదితర వివరాల్లో మార్పులు చేసుకోవాలనుకున్న వారు సైతం స్థానిక వ్యవసాయ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. అన్ని ధ్రువపత్రాలు జిరాక్స్ కాపీలను దరఖాస్తు ఫారానికి జత చేసి అందజేయాలి.

అర్హతలు

రైతు పట్టాదార్ పాసు పుస్తకం కలిగి ఉండాలి. భూభారతిలో పాసు పుస్తకం 2025, జూన్ 5లోపు నమోదై ఉండాలి. ఆధార్ కార్డులో వయస్సు 18 ఏళ్ల నుంచి 59 ఏళ్లలోపు ఉండాలి. అంటే 1966, ఆగస్టు 14 నుంచి 2007 ఆగస్టు 14లోపు జన్మించి ఉన్న రైతులు అర్హులు. ఎన్ని చోట్ల భూమి ఉన్నా బీమాకు మాత్రం ఒక చోటే వర్తిస్తుంది. సంబంధిత రైతులు స్వయంగా కార్యాలయానికి వెళ్లి వ్యవసాయ అధికారికి దరఖాస్తు అందజేయాలి. పట్టాపాసు పుస్తకం, ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు పత్రాలను జతచేయాలి. గతంలో బీమా పాలసీ ఉన్న వారు తిరిగి దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు. వ్యవసాయ శాఖ రెన్యూవల్ చేస్తుంది.

రైతుబీమా
RYTHU BIMA
FARMER'S INSURANCE

బీమాను సద్వినియోగం చేసుకోవాలి



రైతు బీమా నమోదుకు ఈనెల 13వ తేదీ వరకు గడువు ఉంది. అర్హులైన రైతులు గడువులోపు దరఖాస్తు చేసుకోవాలి. సవరణలు, మార్పులకు స్థానిక వ్యవసాయ అధికారి కార్యాలయంలో సంప్రదించారు. ఈ అవకాశాన్ని అర్హులైన రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలి.

- అనురాధ, జిల్లా వ్యవసాయ అధికారి, వరంగల్

రైతు బీమా దరఖాస్తుల స్వీకరణ



కాజీపేటలో దరఖాస్తు స్వీకరిస్తున్న సంతోష్

కాజీపేట / మడికొండ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు బీమా పథకంలో చేరడానికి బుధవారం చివరి తేదీగా నిర్ణయించినట్లు కాజీపేట మండల వ్యవసాయ శాఖ అధికారి సంతోష్ తెలిపారు. కాజీపేట మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూన్ 5వ తేదీలోపు భూభారతి పోర్టల్‌లో పేర్లు ఉన్న రైతులందరికి రైతు బీమా చేసుకోవడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు. పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డుతో మండల వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. కాజీపేట, సోమిడి, భట్టుపల్లి, కొత్తపల్లి, కడిపికొండ, న్యూ శాయంపేట గ్రామాలకు చెందిన రైతులు 85000 76670 ఫోన్ నంబర్‌లో, మడికొండకు చెందిన వారు 70134 66903, రాంపూర్, తరాలపల్లి, అమ్మవారిపేటకు చెందిన రైతులు 96764 47380 ఫోన నంబర్లలో ఏఈఓ సంతోష్ సూచించారు.

నులి పురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్



రామన్నపేట: మాత్ర వేస్తున్న మోహన్ సింగ్



కాజీపేట అర్బన్: మాత్ర అందజేస్తున్న గౌస్ హైదర్

రామన్నపేట: 1 – 19 ఏళ్ల వారందరికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని అధికారులకు ఎస్ఎల్ఈపీ / హెచ్ఐవీ ఎయిడ్స్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ మోహన్ సింగ్ సూచించారు. నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని ఏవీవీ హైస్కూల్, ఆంధ్ర బాలిక ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మేరుగు యశస్విని, డీపీహెచ్ఎన్ఓ మనోజ, డీపీపీసీయూ యూనిట్ డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం మేనేజర్ స్వప్న మాధురి, డిస్ట్రిక్ట్ ఐసీటీసీ సూపర్‌వైజర్ ఆడెపు రామకృష్ణ, డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ కమలాకర్, ఏఎన్ఎంలు లక్ష్మీబాయ్, సులోచన పాల్గొన్నారు.

కడిపికొండ మైనార్టీ గురుకులంలో..

కాజీపేట అర్బన్: నులి పురుగుల నిర్మూలనకు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి గౌస్ హైదర్ సూచించారు. కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను సోమవారం ఆయన అందజేసి మాట్లాడారు. ప్రతీ విద్యార్థి సంపూర్ణ ఆరోగ్యానికి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని గౌస్ హైదర్ సూచించారు.

కరీమాబాద్‌లో..

ఖిలా వరంగల్: 19 ఏళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని కార్పొరేటర్ మరుపల్లి రవి సూచించారు. వరంగల్ కరీమాబాద్ ఉర్సు శ్రీవెంకటేశ్వర ఉన్నత పాఠశాలలో ఎస్ఆర్ఆర్ తోట ప్రైమరీ హెల్త్ సెంటర్ ఆశ వర్కర్ అనిత ఆధ్వర్యంలో సోమవారం మాత్రలు వేశారు.

పదేళ్లల్లో ఒక్క రేషన్ కార్డూ ఇవ్వలేదు

● సన్న బియ్యం పథకం దేశానికే ఆదర్శం
● వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు



రేషన్‌కార్డు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

హసన్‌పర్తి: పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ పార్టీ.. ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ఆరోపించారు. హసన్‌పర్తి మండలంలోని పలు గ్రామాల లబ్ధిదారులకు తెల్లరేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి రేషన్‌కార్డు జారీ చేసినట్లు వివరించారు. రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతర కార్యక్రమంగా పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అన్ని సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డు ఉపయోగపడుతుందని చెప్పారు. రాష్ట్రంలోని సన్న బియ్యం పథకం దేశానికే ఆదర్శమని కొనియాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ చల్లా ప్రసాద్, నాయబ్ తహసీల్దార్ రహీం, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కిరణ్, పొన్నాల రఘు, ఏరుకొండ శ్రీనివాస్, గడ్డం శివరాంప్రసాద్, హరిబాబు, ఎన్ఎస్‌యూఐ జిల్లా మాజీ అధ్యక్షుడు వీసం సురేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, దేవస్థాన చైర్మన్ వెంకటస్వామి పాల్గొన్నారు.

డబుల్‌బెడ్రూం ఇళ్ల పరిశీలన



లక్ష్మీపురంలోని డబుల్‌బెడ్రూం ఇళ్ల వివరాలను ఎమ్మెల్యే నాగరాజుకు వివరిస్తున్న కలెక్టర్

ఖిలా వరంగల్: వరంగల్ 44వ డివిజన్ తిమ్మాపురం రోడ్డు లక్ష్మీపురంలోని డబుల్ బెడ్రూం ఇళ్లను సోమవారం వరంగల్ కలెక్టర్ సత్యశారద, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సందర్శించారు. నిర్మాణం పూర్తయిన డబుల్‌బెడ్రూం ఇళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు మాట్లాడుతూ.. రెండు పడకల గదుల్లో మరమ్మతులు, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, ఎలక్ట్రికల్ పనుల్లో త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలని ఆదేశించారు. ఆగస్టు నెలలోపు 600 ఇళ్లను ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించి అర్హులకు అందజేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ రామిరెడ్డి, హౌసింగ్ పీడీ గణపతి, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు, కార్పొరేటర్ ఈదురు అరుణ, తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కోటలో సోహలికకు ట్రిపుల్ ఐటీలో సీటు



సోహలికను అభినందిస్తున్న యోగా ప్రతినిధులు

ఖిలా వరంగల్: తూర్పుకోటకు చెందిన అర్సం రాంబాబు, స్వాతి దంపతుల కుమార్తె అర్సం సోహలిక.. స్పోర్ట్స్ కోటలో బాసర ట్రిపుల్ ఐటీలో ఇంటిగ్రేటెడ్ కోర్సులో సీటు సాధించింది. ఈ మేరకు ఆమెను వరంగల్ జిల్లా యోగా అసోసియేషన్ బాధ్యులు డాక్టర్ కె.చంద్రశేఖర్ ఆర్య, అధ్యక్షుడు బొలిశెట్టి కమలాకర్, ప్రధాన కార్యదర్శి పాకాల కృష్ణవేణి వరంగల్ రంగశాయిపేటలో సోమవారం అభినందించారు. కార్యక్రమంలో సాంబశివరావు, నరసింహ రాములు, కోట రజిత, డాక్టర్ కె.రాజేశ్వరి, పాకాల రవి, ప్రేమలత జ్యోతి, మౌనిక, కడారి మహేష్, శ్రీనివాస్, పాషా పాల్గొన్నారు.

24న ఆదివాసీల బహిరంగ సభ

నయీంనగర్: ఆదివాసీల హక్కుల అణిచివేతకు వ్యతిరేకంగా ఈ నెల 24న హనుమకొండ అంబేడ్కర్ భవన్‌లో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఆదివాసీ హక్కుల పోరాట సమితి బాధ్యులు గడ్డం లక్ష్మణ్, నక్క నారాయణ రావు, చంద్రమౌళి తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు.

జీపీ సిబ్బంది వేతనాలు పెంచాలి



హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న జీపీ కార్మికులు, నాయకులు

● కలెక్టరేట్ ఎదుట కార్మికుల నిరసన

హన్మకొండ అర్బన్: గ్రామ పంచాయతీ సిబ్బందికి వేతనాలు పెంచి, రెండో పీఆర్సీ పరిధిలోని తీసుకురావాలని, జీఓ నంబర్ 51ని సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) హనుమకొండ జిల్లా గౌరవ అధ్యక్షుడు బొట్ల చక్రపాణి డిమాండ్ చేశారు. ఈ మేరకు జీపీ కార్మికులతో కలిసి నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియం నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు సోమవారం ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అనేక మంది కార్మికుల పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని, వారందరిని యధావిధిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్మికులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, కారోబార్, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ ఇవ్వాలని కోరారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించి, ఈఎస్ఐ, పీఎఫ్, ఉద్యోగ భద్రత, గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి పల్లె రామన్న, జిల్లా నాయకులు ఈసంపల్లి ఐలయ్య, మాట్ల భాస్కర్, బోగం రమేష్, గాదె కుమారస్వామి, ఏసోబ్, పరిక రాజు, సాంబయ్య, రాజయ్య, శ్రీనివాస్, మల్లేశం, సుశీల, గీత, సునీత, రమ, తదితరులు పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులకు రిజర్వేషన్లు కల్పించాలి



నిరసన తెలుపుతున్న క్రైస్తవ సంఘాల ప్రతినిధులు

హన్మకొండ అర్బన్ / న్యూశాయంపేట: రాష్ట్రపతి ఉత్తర్వుల్లో 3వ పేరాను సవరించి దళిత క్రైస్తవులకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. 1950, ఆగస్టు 10న రాష్ట్రపతి జారీ చేసిన ప్రెసిడెన్షియల్ ఎస్సీ ఆర్డర్ రద్దు చేయాలని క్యాథలిక్స్, ప్రొటెస్టంట్ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు క్యాథలిక్ అండ్ ప్రొటెస్టంట్ సంఘాల ఆధ్వర్యంలో హనుమకొండ సీబీసీ చర్చి నుంచి హనుమకొండ, వరంగల్ కలెక్టరేట్ల వరకు సోమవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిరసన తెలిపి కలెక్టరేట్లలో అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రెసిడెన్సియల్ ఆర్డర్‌ను సవరించి దళిత క్రిస్టియన్లు, దళిత ముస్లింలను ఎస్సీ జాబితాలో చేర్చాలని కోరారు. కార్యక్రమంలో సంఘాల కోర్ కమిటీ ప్రతినిధులు విజయ్‌పాల్ రెడ్డి, దానియల్, జాన్ మార్కండేయ, సుధాకర్, ఐజాక్, ప్రవీణ్, మాజీ కార్పొరేటర్ బోడ డిన్నా, అశోక్‌పాల్, బొక్క దయాసాగర్, సామెల్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని పరిశ్రమ రంగంగా గుర్తించాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

హసన్‌పర్తి: వ్యవసాయాన్ని పరిశ్రమ రంగంగా గుర్తించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి డిమాండ్ చేశారు. హసన్‌పర్తి మండలం జయగిరి గ్రామంలో పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో 80కోట్ల ఎకరాల భూమి ఉండగా, సాగుకు 50 కోట్ల ఎకరాలు అనుకూలంగా ఉన్నట్లు చెప్పారు. 35 కోట్ల ఎకరాల్లో మాత్రమే సాగవుతోందని, మరో 15 కోట్ల ఎకరాల భూమిని సాగులోకి తీసుకొచ్చి నిరుపేద కుటుంబాలకు పంపిణీ చేయాలని సూచించారు. స్వామినాథన్ కమిషన్, రంగారావు కమిషన్ సిఫార్సులను వెంటనే అమలు చేయాలన్నారు. ఈ మేరకు ఈ నెల 20వ తేదీ నుంచి మూడు రోజుల పాటు కుత్బుల్లాపూర్‌తో జరగనున్న సీపీఐ మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సీపీఐ మండల కార్యదర్శి శ్యాంసుందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు లక్ష్మణ్, వెంకటేశ్వర్లు, చంద్రమౌళి, రాజేందర్, వై.రాములు పాల్గొన్నారు.

'ఆరోగ్యమిత్ర సంస్థ సేవలు భేష్'

హన్మకొండ: ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ అందిస్తున్న సేవలు భేష్ అని మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ పరికిపండ్ల నరహరి కొనియాడారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఆరోగ్యమిత్ర స్వచ్ఛంద సంస్థ రజతోత్సవ పోస్టర్లు, కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2000వ సంవత్సరంలో స్థాపించిన ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ రెండు తెలుగు రాష్ట్రాల్లో విద్యా, వైద్యం, ఆరోగ్యం, యువత, పర్యావరణం, ఆత్మహత్యల నివారణ, స్వయం ప్రతిపత్తి, స్వావలంబన వంటి అనేక అంశాలపై 25 ఏళ్లుగా నిరంతర కార్యక్రమాలు చేస్తోందని వివరించారు. ఆరోగ్య మిత్ర వ్యవస్థాపకుడు, ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ పరికిపండ్ల అశోక్ మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కరోనా వ్యాధికి హోమియోపతి మందులు పంపిణీ చేసినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో సంస్థ ఆయా జిల్లాల కన్వీనర్లు వెంకట్రామయ్య, పాగాల రంజిత్ కుమార్, భేతి వెంకటేశ్వర్లు, దామోదర్, సహజ, నగేష్ పాల్గొన్నారు.

గణపతి నవరాత్రి ఉత్సవ కమిటీ ఎన్నిక



ఎన్నికైన ఉత్సవ కమిటీ కార్యవర్గ సభ్యులు

హన్మకొండ: హనుమకొండ శ్యామల దుర్గాదాస్ కాలనీ గణపతి నవరాత్రి ఉత్సవ నూతన కమిటీని కాలనీలోని పార్కులో సోమవారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పొన్నోజు వీరబ్రహ్మాచారి ఎన్నికల అధికారిగా వ్యవహరించగా, అధ్యక్షుడిగా డాక్టర్ నల్లాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా గూడూరు రవీందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా రొయ్యల సత్యం, సంయుక్త కార్యదర్శిగా చెన్నూరు బాబురావు, కోశాధికారిగా రాంపెల్లి రాజప్రభు, సాంస్కృతిక కార్యదర్శిగా అటిక రాజు, గౌరవ అధ్యక్షుడిగా పొన్నోజు వీరబ్రహ్మాచారి, సభ్యులుగా తంగళ్లపల్లి శంకరాచారి, కటకం శివప్రసాద్, యెలసాని అయోధ్య, వనం రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సంక్షిప్తంగా

క్విట్ ఇండియా స్ఫూర్తితో పోరాటం

ఖిలా వరంగల్: క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్మిక వర్గ పోరాటాలను మరింత ఉధృతం చేయాలని ఏఐసీటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కెర రామస్వామి, ఎంసీపీఐ(యూ) నేత నర్రప్రతాప్, నగర కార్యదర్శి మాలోతు సాగర్ పిలుపునిచ్చారు. వరంగల్ అండర్ బ్రిడ్జి వద్ద ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యాలయంలో సుంచు జగదీశ్వర్ అధ్యక్షతన సోమవారం సమావేశం జరిగింది. అశోక్, ఎగ్గని మల్లికార్జున్, సహాయ కార్యదర్శి ఎండీ.మహబూబ్ పాషా, యాదగిరి, సుధ, ఓదెలు, తాటికాయల రత్నం, నరసయ్య, మాలి ప్రభాకర్, యాకయ్య పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ వార్షికోత్సవాలను విజయవంతం చేయాలి

రామన్నపేట: ఈనెల 12 నుంచి 31వ తేదీ వరకు జరగనున్న ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్ కోరారు. ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాల వాల్‌పోస్టర్లను వరంగల్‌లోని వివేకానంద కళాశాల ప్రాంగణంలో సోమవారం విడుదల చేశారు. కార్యక్రమంలో శ్రేయస్ రాజు, రమేష్, ప్రశాంత్, కిషోర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

రామన్నపేట: సీపీఐ 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ వరంగల్ మండల కార్యదర్శి గుండె బద్రి పిలుపునిచ్చారు. ఈ మేరకు పోచమ్మమైదాన్ కూడలిలో మహాసభల వాల్‌పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు జన్ను రవి, పరికిరాల రమేష్, దస్రు, శంకర్, అంజాద్, అనిల్, భాస్కర్ పాల్గొన్నారు.

రైతుల ఎఫ్‌పీఓ సభ్యత్వ నమోదు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం వంగపహాడ్ గ్రామంలో రైతుల ఎఫ్‌పీఓ (రైతు ఉత్పత్తిదారుల సంఘం) సభ్యత్వ కార్యక్రమాన్ని పీఏసీఎస్ చైర్మన్ మేర్గు రాజేష్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. ప్రతీ రైతు ఎఫ్‌పీఓలో సభ్యత్వం పొందాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ సీఈఓ పరమేష్, ముల్కలపల్లి మహేష్, గండు రమేష్, సిలివేరు స్వామి, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో 'అక్షయ పాత్ర'

ఖిలా వరంగల్: అక్షయ పాత్ర ఆధ్వర్యంలో సరఫరా చేసిన భోజన పథకాన్ని వరంగల్ కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం మధ్యాహ్నం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా ఏఎంఓ (అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్) సృజన్‌తేజ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

ఘనంగా బొడ్రాయి వార్షికోత్సవం

మడికొండ: కాజీపేట మండలం మడికొండలో బొడ్రాయి 8వ వార్షికోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. అర్చకుడు ప్రసాద్ మంత్రోచ్ఛరణల మధ్య క్షీరాభిషేకం, విఘ్నేశ్వర పూజ, స్వస్తి వచనం, స్థలశుద్ధి కార్యక్రమం నిర్వహించారు. వేడుకల్లో బొడ్రాయి కమిటీ సభ్యులు తొట్ల రాజుయాదవ్, బుర్ర శ్రీధర్‌గౌడ్, బైరి కొంరయ్య, పల్లపు రాజేందర్, అల్లం శ్రీనివాస్, గాండ్ల భిక్షపతి, దువ్వ విజయ్, పొనగొటి వెంకట్‌రావు, వస్కుల శ్రీనివాస్, శంకర్, భాస్కర్, పల్లపు అర్జున్, బొల్లికొండ వినోద్ పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపులో పక్షపాతం

కాజీపేట: అవకాశాలు వచ్చినా రాకున్నా కాంగ్రెస్ పార్టీనే నమ్ముకుని మూడున్నర దశాబ్దాలుగా క్రియాశీలకంగా పనిచేస్తున్న తనకు బాలసముద్రంలో డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపులో అవకాశం ఇవ్వకపోవడం బాధాకరమని పార్టీ సీనియర్ నాయకురాలు మద్దెల శోభారాణి ఆవేదన వ్యక్తం చేశారు. రహమత్‌నగర్‌లో ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఉండడానికి ఇల్లులేక కిరాయి ఇంటిలో ఉంటున్న తనలాంటి కార్యకర్తకు కాకుండా నిన్న, మొన్న బీఆర్ఎస్ నుంచి వచ్చిన వారికి ఇళ్లు ఇవ్వడం శోచనీయమని వాపోయారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ తిలక్‌నగర్ కాలనీలో రూ.25 లక్షల వ్యయంతో చేపట్టిన సైడ్ డ్రెయినేజీ పనులతో పాటు 25 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను కార్పొరేటర్ విజయశ్రీరజాలీ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు గుంటి కుమారస్వామి, అరూరి సాంబయ్య, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు పోగుల రాకేష్, సంతోష్, క్రాంతి భరత్‌రాజ్, ఎండి.బిలాల్, కొండా శివ, నవీన్, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి దేవాలయ పాలకమండలి చైర్మన్‌కు సన్మానం

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయ పాలక మండలి చైర్మన్ డాక్టర్ బండారు శివ సుబ్రహ్మణ్యంను హనుమకొండ రాంనగర్‌లోని ఆయన నివాసంలో తెలంగాణ అర్చక సమాఖ్య జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ సన్మానించారు.

సెల్ టవర్ నిర్మాణ పనులు నిలిపివేయాలి

హసన్‌పర్తి: సెల్ టవర్ నిర్మాణ పనులు వెంటనే నిలిపివేయాలని సీతంపేట గ్రామస్తులు కోరారు. ఈ మేరకు గ్రీవెన్స్‌లో అధికారులకు సోమవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో స్థానికులు చొక్కం మహేందర్, దుర్గం అశోక్, బౌతు కుమార్, తిరుపతి, సంతోష్, స్వరూప, సాయికిరణ్, రాజయ్య లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలిక అప్పగింత

న్యూశాయంపేట: ములుగు జిల్లా ఏటూరు నాగారానికి చెందిన బాలిక అయేషా ఆదివారం ఉదయం తప్పిపోయింది. బాలిక తండ్రి యాకూబ్ ఫిర్యాదు మేరకు వరంగల్ ఏనుమాముల పోలీస్ స్టేషన్ బ్లూకోట్స్ సిబ్బంది సీసీటీవీ ఫుటేజీల సహాయంతో ఆ బాలిక ఆచూకీ కొనుగొని యాకూబ్‌కు ఆదివారం సాయంత్రం అప్పగించినట్లు ఏనుమాముల ఎస్సై రాజు తెలిపారు.

హైవేపై రేడియం స్టిక్కర్ బోర్డు ఏర్పాటు

న్యూశాయంపేట: ఆరెపల్లి వద్ద జాతీయ రహదారిపై రాత్రి వేళ ప్రమాదాలు జరగకుండా రేడియంతో కూడిన స్టిక్కర్‌తో బోర్డు ఏర్పాటు చేసినట్లు ఏనుమాముల ఇన్‌స్పెక్టర్ సురేష్, ఎస్సై రాజు తెలిపారు.

లోటస్ సొసైటీని రద్దు చేయాలి

న్యూశాయంపేట: నగరంలోని 3వ డివిజన్ పైడిపల్లి ఆర్టీసీ కాలనీలో లోటస్ సొసైటీ పేరున కాలనీ డెవలప్‌మెంట్ పేరుతో డబ్బులు డిమాండ్ చేస్తున్న సొసైటీని, కమిటీని రద్దు చేయాలని స్థానికులు జన్ను స్వామిదాస్, ఎలకొండ ప్రతాప్, విజయ్, జన్ను రవి, కైలాసం కోరారు. జిల్లా కో ఆపరేటివ్ అధికారికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.